# ప్రజా మహిమ

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 279 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 13 - 05 - 2026




పోక్సో కేసు బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు
నేడు మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని నోటీసులు

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలు తప్పవు
- రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దిశానిర్దేశం
- కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశాలు
- ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ



**హైదరాబాద్ :**

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలన్నారు.రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల - మిగతా 2 లో

# కవితకు కోర్టు నోటీసులు



- కోర్టుకు హాజరు కావాలంటూ కవితకు నోటీసులు
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో రైల్ రోకో
- కవితపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు
- విచారణకు రావాలంటూ సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సమన్లు

**హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన - మిగతా 2 లో




# పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్

- తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- హైదరాబాద్‌లో ఇళ్ళ స్థలాలు ఉంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్న మంత్రి
- జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడి
- విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామన్న మంత్రి

# తెలుగు రాష్ట్రాలకు తాగునీటి విడుదల

- కేఆర్ఎంబీ నిర్ణయం
- ముగిసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం
- తెలంగాణ, ఏపీ తాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలకు నిర్ణయం
- శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదలకు కుదిరిన అంగీకారం



**హైదరాబాద్ :**

తాగునీటి అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల, తెలంగాణకు 21 టీఎంసీల విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అనుమతించింది. హైదరాబాద్ జలసౌధ వేదికగా జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాగునీటి అవసరాల కోసం మే నెలాఖరు వరకు సాగర్ కుడి కాల్వ నుంచి 10 టీఎంసీలు ఇవ్వాలని ఏపీ ఇప్పటికే బోర్డును కోరింది. జూలై నెలాఖరు వరకు శ్రీశైలం నుంచి 5, సాగర్ నుంచి 13 టీఎంసీల నీరు ఇవ్వాలని తెలంగాణ కోరింది.తాగునీటి కోసం నిర్ణయం : రెండు రాష్ట్రాల అవసరాలపై కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీ ఈఎన్సీలు రమేష్ బాబు, నర్సింహమూర్తి చర్చించారు. ఏపీ ఇప్పటికే కోటాకు మించి నీటిని వాడుకొందని, మళ్లీ ఇస్తే తమకు నష్టం జరుగుతుందని తెలంగాణ ఈఎన్సీ తెలిపింది. అయితే తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్లు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా - మిగతా 2 లో

## భూమిని వేడెక్కిస్తుంది... గాలిని చల్లబరుస్తుంది.. ఏమిటది?

- భూమిని వేడి చేసే కార్బన్ డయాక్సైడ్ పై వాతావరణాన్ని చల్లబరుస్తోంది
- ఈ వింత ప్రవర్తన వెనుక ఉన్న కారణాలను తాజా అధ్యయనంలో గుర్తించిన శాస్త్రవేత్తలు
- దిగువ వాతావరణంలో దుప్పటిలా, పైపొరలలో రేడియేటర్‌లా పనిచేస్తున్న కార్బన్ డయాక్సైడ్
- 1980ల నుంచి స్ట్రాటోస్పియర్ సుమారు 2 డిగ్రీల మేర చల్లబడినట్లు వెల్లడి




# సరిహద్దులో భారత్ ఫెన్సింగ్

- ఘాటుగా స్పందించిన బంగ్లాదేశ్
- భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో కంచె నిర్మాణం
- బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయించిన బెంగాల్‌లోని సువేందు ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వంతోనే తమకు సంబంధాలు ఉంటాయన్న బంగ్లా విదేశాంగ శాఖ సలహాదారు







# ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
- వారం రోజుల్లో అమరావతిలోని ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం
- 20 రోజుల్లో ఎమ్మెల్సీల భవనాలను జీఏడీకి అప్పగిస్తామన్న నారాయణ
- అధికారులు, మంత్రుల భవనాలు కూడా తుది దశకు చేరుకున్నాయని వెల్లడి
- ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని 2027 ఆగస్ట్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యమన్న మంత్రి

## ఇవాళ 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది



- మంత్రి నారా లోకేష్
- గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ
- అసోం సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నేతలు
- గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించిన లోకేష్
- ఏపీలో జరుగుతున్న పనులను గడ్కరీ ప్రశంసించారని వెల్లడి

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన - మిగతా 2 లో

# 24 గంటల్లోనే కొత్త వాహనం రిజిస్ట్రేషన్

- కొత్త వాహనం రిజిస్ట్రేషన్ 24 గంటల్లో పూర్తి కావాలి
- ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో పెను మార్పు
- 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారి స్పందించకపోతే ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్
- సెలవు దినాల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్న మంత్రి



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో పెను మార్పులు తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం వాహనదారులకు భారీ ఊరటనిచ్చే వార్తను అందించింది. ఇకపై కొత్త వాహనం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే, డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత సంబంధిత అధికారి 24 గంటల్లోపు దానిపై స్పందించకపోతే, ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లుగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## అంకెల వలయంలో శ్రామికుడు !

మన కాలంలో అత్యంత భయంకరమైన అబద్ధాలు అందమైన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల రూపంలోను, రంగురంగుల చార్టులు, నివేదికల రూపంలోను వస్తాయి. ఆధునిక సామ్రాజ్యవాదం ఇప్పుడు దేశాలను ఆక్రమించడం లేదు, అది నేరుగా మనుషుల శ్రమనూ, వారి జీవించే హక్కును ఆక్రమిస్తోంది. ఈ వ్యవస్థీకృత హింసను కప్పిపుచ్చడానికి కార్పొరేట్ శక్తులు ఎంచుకున్న తాజా ఆయుధమే ఇటీవలి 'వర్క్ ఇండియా' నివేదిక.ఈ నివేదికను పైపైన చూస్తే, భారతదేశంలో శ్రామికవర్గం పాలు తేనెల్లో తేలియాడుతున్నట్లు, వారి జీవితాల్లో ఏదో అద్భుతమైన స్వర్ణయుగం నడుస్తున్నట్లు అనిపిస్తుంది. బ్లూ కాలర్ కార్మికులు వైట్ కాలర్ ఉద్యోగుల కంటే వేగంగా ఎదుగుతున్నారని, వారి జీతాలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఒక అద్భుతమైన భ్రమను అల్లుతుంది. కానీ, ఈ అంకెల తెరను చీల్చి చూస్తే అక్కడ కనిపించేది అభివృద్ధి కాదు, దశాబ్దాలుగా రక్తం చిందించి కార్మికులు సాధించుకున్న హక్కులపై ముప్పేట దాడి.వర్క్ ఇండియా నివేదిక యాజమాన్యాల ప్రయోజనాల కోసం పకడ్బందీగా అల్లిన ఒక కార్పొరేట్ కుట్ర. గణాంకాల గారడీ, ఆకలిని కప్పిపుచ్చే అంకెల అబద్ధం. ఈ నివేదిక ప్రకారం, 2024లో బ్లూ కాలర్ కార్మికుల సగటు వేతనం నెలకు రూ.14,056 ఉంటే, 2025 నాటికి అది 8.6శాతం పెరిగి రూ.15,265కు చేరిందట. కాగితాల మీద ఈ 8.6 శాతం అనేది ఒక అద్భుతమైన వృద్ధి లాగా కనిపిస్తుంది. కానీ ఈ దేశంలో వీధి అంచున నిలబడి బతుకు పోరాటం చేసే సగటు మనిషిని అడిగితేనే, ఈ రూ.1,200 పెరుగుదల వాస్తవానికి ఒక పెంపా లేక అవమానమా అనేది అర్థమవుతుంది. మార్కెట్‌లో నిశ్శబ్దంగా తిరుగుతూ పేదవాడి కంచంలోని ముద్దను ఎత్తుకుపోయే 'ద్రవ్యోల్బణం' అనే రాక్షసుడి గురించి ఈ నివేదిక ఎందుకు మాట్లాడదు? పెట్రోల్ ధరలు, కూరగాయల ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలు ఇరవై ముప్పై శాతాలు పెరుగుతున్నప్పుడు, ఈ ఎనిమిది శాతం జీతం పెంపు అనేది కార్మికుడి కడుపు నింపుతుందా, లేక వాడిని మరింత అప్పుల ఊబిలోకి నెడుతుందా?జాతీయ లేబర్ వేజెస్ కమిషన్ స్వయంగా ఒక సెమీ-స్కిల్డ్ వర్కర్‌కు నెలకు కనీసం రూ.30,000 (రోజుకు రూ. 1,000) వేతనం ఉండాలని ఘోషిస్తుంటే, కార్పొరేట్ రాబందులు మాత్రం రూ.15,265 ఇచ్చి, అదేదో మహాభాగ్యం అన్నట్లు నివేదికలు వండివార్చడం వారి అహంకారానికి, శ్రమ దోపిడీకి పరాకాష్ఠ. నిజమైన వృద్ధి అనేది మార్కెట్ ధరలకు అనుగుణంగా ఉండాలి, దాని ప్రకారమైతే ఇక్కడ కార్మికుడి జీవితం పాతాళానికి దిగజారుతోంది.పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎప్పుడూ ఒక పాత వ్యూహం ఉంటుంది. "బాధితులను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పు, అప్పుడు వారు అసలు దోపిడీదారుడిని ప్రశ్నించరు." వైట్ కాలర్, బ్లూ కాలర్ ఉద్యోగుల జీతాలను పోల్చడం వెనుక ఉన్న కుట్ర ఇదే. వైట్ కాలర్ ఉద్యోగికి (అడ్మినిస్ట్రేషన్ సపోర్ట్) కనీసం బేసిక్ జీతంతో పాటు ప్రతి ఏటా పెరిగే డీఏ, టీఏ వంటి రక్షణ కవచాలు ఉంటాయి. కానీ అగ్నిగుండం లాంటి ఫ్యాక్టరీలో, ఎండలో కరిగే బ్లూ కాలర్ కార్మికుడికి దక్కేది కేవలం ఆ కనీస వేతనం మాత్రమే. ఈ రెండు వర్గాలను పోల్చి, "చూడండి ఏసీ గదుల్లో ఉండే వైట్ కాలర్ ఉద్యోగుల కంటే బ్లూ కాలర్ కార్మికులకే జీతాలు ఎక్కువగా పెరుగుతున్నాయి" అని ప్రచారం చేయడం ఒక పచ్చి అబద్ధం. సమాజంలో కార్మికుల పట్ల ఉండే సానుభూతిని చంపేసి, "వారికి అన్నీ అందుతున్నాయి, వారు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు" అనే ఒక తప్పుడు నెరేటివ్‌ను ప్రజల మెదళ్లలో నాటడానికే ఈ తరహా నివేదికలు వెలువడుతూంటాయి.ఈ నివేదికలు ఎందుకు ఇప్పుడే పుట్టుకొస్తున్నాయి? కార్మికులు శతాబ్ద కాలంగా రక్తం, కన్నీరు చిందించి, లాఠీ దెబ్బలు తిని సాధించుకున్న 29 చట్టాలను చెత్తబుట్టలో వేసి, కేవలం నాలుగు 'లేబర్ కోడ్స్'ను ప్రభుత్వాలు అమలు చేయబోతున్నాయి. ఈ కోడ్స్ అన్నీ యాజమాన్యాల దోపిడీని చట్టబద్ధం చేసేవే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ముసుగులో జరుగుతున్న ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటింగ్ హ్యూమన్స్ (మనుషులను దోచుకునే వెసులుబాటు) ఇది. క్రూరమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు సామాజిక మద్దతును కూడగట్టడానికే ఇలా కార్మికుల జీతాలపై అక్కసు వెళ్లగక్కుతూ నివేదికలు ఇప్పిస్తున్నారు.పెట్టుబడిదారీ వ్యవస్థకు మానవత్వం ఉండదు, దానికి తెలిసింది లాభం మాత్రమే. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న మినీ వరల్డ్ వార్‌ను సైతం మన దేశంలోని కార్పొరేట్ శక్తులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నాయి. కార్మికుల జీతాల్లో కోత విధించడానికి, కనీస వేతనాలు పెంచకుండా ఉండటానికి అంతర్జాతీయ పరిణామాలను అవి ఒక సాకుగా వాడుకుంటాయి. సంక్షోభం వచ్చినప్పుడు నష్టాలను కార్మికుల నెత్తికి రుద్దడం, లాభాలు వచ్చినప్పుడు వాటిని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడం కార్పొరేట్ సంస్థల నైజం.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కేవలం పీల్చుకోవడానికి గాలిని మాత్రమే కాదు, ప్రతి పౌరుడికి 'గౌరవప్రదమైన జీవన హక్కు'ను ప్రసాదించింది. పెరుగుతున్న ధరల మధ్య రూ.15,000తో నెట్టుకొచ్చే జీవితం గౌరవప్రదమైనది కాదు. ఇది కేవలం కొద్దిమంది జీతాల సమస్య కాదు. ఇది శ్రామిక వర్గం మనుగడకు, కార్పొరేట్ విధ్వంసానికి మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ అంకెల గారడీని, ఈ నివేదికల విషాన్ని కార్మిక లోకం గుర్తించాలి. బ్లూ కాలర్, వైట్ కాలర్ అనే భేదాలు మర్చిపోయి ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా నిలబడాలి. మన నెత్తురును లాభాలుగా మార్చుకునే ఆ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఎలుగెత్తి పోరాడాలి.

## 24 గంటల్లోనే కొత్త వాహనం రిజిస్ట్రేషన్

మొదటిపేజీ తరువాయి - పరిగణించబడుతుంది. ఇది దేశంలోనే ఒక విప్లవాత్మక నిర్ణయం అని చెప్పవచ్చు. దీనివల్ల వాహనదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. సెలవు దినాల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, కేవలం ఫ్యాన్సీ నంబర్లను కోరుకునే వాహనదారులకు మాత్రమే ఈ 24 గంటల నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది, ఎందుకంటే ఆ ప్రక్రియ వేలం ద్వారా జరుగుతుంది. సామాన్య వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అవినీతికి తావులేకుండా సేవలు అందించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం.

## ఇవాళ 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది



మొదటిపేజీ తరువాయి - వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని కొనియాడారు.ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు. ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

## కవితకు కోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి - డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్‌రోకో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఆమెతో పాటు మరో 12 మందిపై రైల్వే యాక్ట్‌లోని యూ/సెక్షన్ 147, 74(ఏ) కింద కేసులు నమోదయ్యాయి.ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కవితకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది.

# ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం



మొదటిపేజీ తరువాయి - ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. నిర్ణీత గడువులోగా భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా, రాజధాని ప్రాంతంలో పర్యటించిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవనాలు దాదాపుగా పూర్తికావొచ్చాయని మంత్రి వెల్లడించారు. మరో వారం రోజుల్లో ఎమ్మెల్యే భవనాలను, మరో 20 రోజుల్లో ఎమ్మెల్సీ భవనాలను సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తామని తెలిపారు.అధికారులు, మంత్రుల నివాస భవనాలు కూడా తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన చిన్నపాటి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియపై కూడా మంత్రి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటికే 98.6 శాతం మంది రైతులకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, మిగిలిన స్వల్ప శాతం ప్లాట్లు కొన్ని వివాదాల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని 2027 ఆగస్ట్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మొదటిపేజీ తరువాయి - కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ధాన్యం సేకరణలోని సమస్యలపై వివరాలను తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా ధాన్యం సేకరణలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతన్నలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం పూర్తి వివరాలను ఆయా జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ే ఎకరించిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులోకి తీసుకురాని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలని ఆదేశించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గిడ్డంగుల సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.సేకరించిన ధాన్యాన్ని తాత్కాలికంగా రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్‌కు తరలించాలని సీఎం సూచించారు. వెసులుబాటు ఆధారంగా అక్కడి నుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దని చెప్పారు. అవసరమైన చోట పోలీసుల సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలని తెలిపారు.అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని సీఎం తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు.కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

# తెలుగు రాష్ట్రాలకు తాగునీటి విడుదల



మొదటిపేజీ తరువాయి - అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దీంతో ఏపీ విజ్ఞప్తి మేరకు ఆగస్టు నెలాఖరు వరకు సాగర్ కుడి కాల్వ నుంచి పది టీఎంసీలు ఇచ్చేందుకు అనుమతించారు.గురువారం బోర్డు పూర్తి స్థాయి సమావేశం : ఏపీకి పది టీఎంసీలుపోగా రెండు ఉమ్మడి జలాశయాల్లో మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని, మళ్లీ ఇవ్వరాదని తెలంగాణ ఈఎన్సీ అన్నారు. శ్రీశైలంలో 5 టీఎంసీలకుపైగా, నాగార్జునసాగర్‌లో దాదాపు 16 టీఎంసీల వరకు తెలంగాణ వినియోగానికి త్రిసభ్య కమిటీ అనుమతించింది. అటు గురువారం బోర్డు పూర్తి స్థాయి సమావేశం జరగనుంది. ఆ సమయంలో నీటి వాటాలు సహా అన్ని అంశాలపై చర్చ జరగనుంది.ఈ నెల 14న మరోసారి సమావేశం : త్రిసభ్య కమిటీ సమావేశం సాఫీగా సాగిందని ఏపీ ఈఎన్‌సీ నరసింహమూర్తి తెలిపారు. ఆగస్టు 15 వరకు ఏపీ నీటి అవసరాల కోసం 10 టీఎంసీలు, తెలంగాణకు శ్రీశైలం నుంచి 5, సాగర్ నుంచి 16 టీఎంసీలు వినియోగించుకోవచ్చని ఏపీ ఈఎన్‌సీ ప్రకటించింది. ఈ నెల 14న జరిగే బోర్డు సమావేశంలో మిగిలిన అంశాలపై చర్చిస్తామని పేర్కొంది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తాగునీటి అవసరాలపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ ఇవాళ సమావేశమైంది. హైదరాబాద్‌లోని జలసౌధ వేదికగా కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నర్సింహమూర్తి సమావేశమయ్యారు.

## భూమిని వేడెక్కిస్తుంది... గాలిని చల్లబరుస్తుంది.. ఏమిటది?




మొదటిపేజీ తరువాయి - భూమిని వేడెక్కించే కార్బన్ డయాక్సైడ్.. అదే సమయంలో వాతావరణంలోని పైపొరలను చల్లబరుస్తోందంటే నమ్మగలమా? ఈ విచిత్ర ప్రవర్తన వెనుక ఉన్న రహస్యాన్ని శాస్త్రవేత్తలు తాజాగా ఛేదించారు. భూమికి హానిచేసే ఈ వాయువు ఒకేసారి వేడి చేసేదిగా, చల్లబరిచేదిగా ఎలా పనిచేస్తుందో తమ పరిశోధనలో స్పష్టంగా వివరించారు.కార్బన్ డయాక్సైడ్ రెండు విభిన్న పాత్రలు పోషిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మనం నివసించే దిగువ వాతావరణంలో ఇది ఒక దుప్పటిలా పనిచేసి, సూర్యుడి నుంచి వచ్చే వేడిని భూమి ఉపరితలం వద్ద బంధిస్తుంది. దీనివల్లే భూతాపం పెరుగుతోంది. అయితే, భూమికి సుమారు 11 నుంచి 50 కిలోమీటర్ల ఎత్తులో ఉండే స్ట్రాటోస్ఫియర్ పొరలో దీని పనితీరు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అక్కడ ఇది ఒక రేడియేటర్‌లా పనిచేస్తూ, వేడిని గ్రహించి అంతరిక్షంలోకి విడుదల చేస్తుంది. ఫలితంగా ఆ పొర చల్లబడుతుంది.తాజా అధ్యయనం ప్రకారం, 1980ల మధ్యకాలం నుంచి ఇప్పటివరకు స్ట్రాటోస్ఫియర్ సుమారు 2 డిగ్రీల మేర చల్లబడింది. ఇది మానవ కార్యకలాపాలు లేని సహజ ప్రక్రియ కంటే పది రెట్లు వేగవంతమైనదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కొన్ని ప్రత్యేకమైన ఇన్‌ఫ్రారెడ్ కాంతి తరంగదైర్ఘ్యాలతో కార్బన్ డయాక్సైడ్ ప్రతిస్పందించడమే ఈ శీతలీకరణకు ప్రధాన కారణమని అధ్యయన బృందం కనుగొంది. కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు పెరిగేకొద్దీ ఈ ప్రక్రియ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ, పైపొరలను వేగంగా చల్లబరుస్తోందని అధ్యయన ప్రధాన పరిశోధకుడు షాన్ కోహెన్ తెలిపారు."ఈ దృగ్విషయం దశాబ్దాలుగా తెలుసు, కానీ దీని వెనుక ఉన్న పూర్తి యంత్రాంగం ఇప్పటివరకు అర్థం కాలేదు. ఇది వాతావరణ మార్పుల యొక్క ఫింగర్‌ప్రింట్ లాంటిది" అని కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్త రాబర్ట్ పింకస్ అభిప్రాయ పడ్డారు. ఈ పరిశోధన ఫలితాలు భవిష్యత్తులో ఇతర గ్రహాల వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి, అంతరిక్ష యాత్రల ప్రణాళికలకు కూడా ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

# సరిహద్దులో భారత్ ఫెన్సింగ్



మొదటిపేజీ తరువాయి - పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దు రక్షణపై తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తాజాగా స్పందించింది.భారత్ సరిహద్దుల్లో ముళ్లకంచె వేయడంపై బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం.హెచ్. కబీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ముళ్ల తీగలకు ఢాకా భయపడదు" అని పేర్కొంటూనే, తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోమని, తమకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే సంబంధాలు ఉంటాయని ఆయన వివరించారు. సవాళ్లు ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు నాయకత్వం కట్టుబడి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.బీజేపీ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం, అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే సరిహద్దు కంచె నిర్మాణ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తొలి మంత్రివర్గ సమావేశంలోనే బీఎస్ఎఫ్‌కు అవసరమైన భూమిని కేటాయించడం ద్వారా ఈ దిశగా బలమైన ముందడుగు వేశారు. అక్రమ చొరబాట్లను అరికట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్య ఇప్పుడు పొరుగు దేశంతో ఉన్న సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్



మొదటిపేజీ తరువాయి - పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ రెండో రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండో విడతకు సంబంధించిన విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ కోసం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలిపారు.

# విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**జగిత్యాల మే 12 ( ప్రజా మంటలు)** :జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో, జడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ఎం సంజయ్ కుమార్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదవ తరగతిలో ఫెయిల్ అయినంత మాత్రాన నిరాశ నిస్పృహలకు లోను కావొద్దని, నేను కూడా పదవతరగతి పరీక్షల్లో రెండు సబ్జెక్టులు తప్పానని, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో, ఆత్మవిశ్వాసంతో మళ్లీ పాస్ అయి, ఈ రోజు జనాలు అందరూ మెచ్చే వైద్యుడిగా, శాసనసభ్యుడిగా మీ ముందున్నానని తెలుపుతూ, పిల్లలందరూ ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయా సబ్జెక్టుల్లో ఉన్న మెళకువలు నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో పదవ తరగతి పరీక్షలు రాసి పాస్ అయి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇట్టి శిక్షణా కార్యక్రమం పదవతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పిల్లలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల విద్యాధికారి చంద్రకళ, జగిత్యాల గ్రామీణ మండల విద్యాధికారి గంగాధర్, ధరూర్ క్యాంప్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు పటిష్ట భద్రత





**కొండగట్టు మే 12 (ప్రజా మంటలు)** :భక్తుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటురాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్ల వినియోగంహనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ అర్ధరాత్రి ఆకస్మికంగా పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేస్తూ, పోలీస్ అధికారులకు, సిబ్బందికి వైర్లెస్ సెట్ల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ అన్ని విభాగాల మధ్య సమన్వయం కల్పించారు. . భక్తుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు: భక్తులకు తక్షణ సహాయం అందించేందుకు పోలీస్, రెవెన్యూ మరియు వైద్య శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కాలినడకన వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్గమధ్యంలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి, తాగునీరు, ప్రథమ చికిత్స, మార్గదర్శక సేవలు అందిస్తున్నారు.రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్ల వినియోగం: హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు చేరుకునే సమయంలో ముఖ్యంగా రోడ్డు ఇరువైపులా జాగ్రత్తగా నడుస్తూ, వాహనాలను గమనిస్తూ తమ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎలాంటి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలో బాగంగా భక్తుల యొక్క బ్యాగులు, జెండాలు మరియు ఇతర వస్తువులపై రేడియం స్టిక్కర్లను అంటించడం జరిగింది. చీకటి సమయంలో కూడా ఈ రేడియం స్టిక్కర్లు స్పష్టంగా కనిపించడంతో వాహనదారులు దూరం నుంచే భక్తులను గమనించి తమ వాహనాల వేగాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. దీని ద్వారా రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చుఅన్నారు.

# మహిళా భద్రతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



**జగిత్యాల మే 12 ( ప్రజా మంటలు)** :నైతిక బాధ్యతగా బండి సంజయ్ రాజీనామా చెయ్యాలి. బీఆర్ఎస్ మహిళా నేత, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి.జగిత్యాల : మహిళల భద్రత, అత్యాచారాల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని బీఆర్ఎస్ మహిళా నేత, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి ఆరోపించారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై అత్యాచారం ఆరోపణలు వస్తుంటే, పోలీస్ శాఖ విచారణ చేపట్టి, కేసులు నమోదు చెయ్యకపోవడం అత్యంత విచారకరం అన్నారు. అటు దేశంలో బిజెపి, రాష్ట్రం లో కాంగ్రెస్ పాలనలో మహిళల రక్షణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అత్యాచారాలు, హత్యాల నివారణ చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, హోమ్ శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి విఫలం అయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర మహిళలతో పాటుగా, విదేశీ మహిళపై కూడా అత్యాచారం జరిగిన ఉదంతాలు ఉన్నాయని గుర్తు చేశారు. బండి సంజయ్ స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చెయ్యాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్ పర్సన్ శీలం ప్రియాంక ప్రవీణ్, లక్ష్మీపూర్ సర్పంచ్ కవిత,మాజీ సర్పంచ్ ఎల్ల గంగనర్సు, మాజీ కౌన్సిలర్ శ్రీలత,బీఆర్ఎస్ మహిళా నాయకులు పట్నం అనురాధ, బండపెల్లి మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

# ఉచిత క్యాన్సర్ నిర్ధారణ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల మే 12(ప్రజా మంటలు)** : పట్టణ ఐఎంఏ భవన్ లో మిడ్వేవ్ క్యాన్సర్ హాస్పిటల్ కరీంనగర్, ఐఎంఏ జగిత్యాల వారి ఆద్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ క్యాంప్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షులు డా. హేమంత్,ప్రధాన కార్యదర్శి డా.శ్రీనివాస్,కోశాధికారి డా.సుధీర్,డా.మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్,నాయకులు క్యాదసు నాగయ్య,కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్ ,డా.కౌశిక్,డా.హారిక,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి తలసానికి ఘన సత్కారం

**ఘనంగా ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం**



**సికింద్రాబాద్, మే 12 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ భోలక్ పూర్ లోని శ్రీ ఎల్లమ్మ తల్లి నూతన దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సనత్ నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ కు కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కారం నిర్వహించింది. ఈ సందర్భంగా కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ ను కలిసి, శాలువా, మెమెంటోతో సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మంచాల మాట్లాడుతూ... తమ పాఠశాల అభివృద్ధి లోను, ప్రతి విజయంలోను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారం , ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ విజయ్, పాఠశాల సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా కొప్పూరు గుట్టకు పోటెత్తిన భక్తులు



**భీమదేవరపల్లి, మే 13( ప్రజా మంటలు):–** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండల పరిధిలోని కొప్పూరు గుట్ట, గద్దలబండ పంచముఖ అంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా పల్లకీ సేవ, గిరిప్రదక్షిణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం రాష్ట్ర పరిరక్షణ కమిటీ కార్యదర్శి సౌమిత్రి దక్షిణాచార్యులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. “జై హనుమాన్” నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.ఎల్కతుర్తి, హుజురాబాద్, హనుమకొండ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ మాలధారుల పాదయాత్రలతో ఆలయ పరిసరాలు కాషాయమయంగా మారాయి. భక్తులు కోలాటం ఆడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి కోనేరు వద్ద భక్తుల రద్దీ అధికంగా కనిపించింది.ఆలయ కమిటీ చైర్మన్ కాసం రమేష్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కనీసం 25 వేల మందికి పైగా భక్తులు స్వామివారికి మాలధారణ చేస్తారని తెలిపారు. పెద్ద హనుమాన్ జయంతి రోజున చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు.ఎల్కతుర్తి మాజీ వైస్ ఎంపీపీ తంగెళ్ల నగేష్ మాట్లాడుతూ, ప్రతి ఏటా స్వామివారి దర్శనానికి వస్తానని, స్వామివారి కృపతో అందరి కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అంజనేయ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

# ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు 15న ఇంటర్వ్యూలు




**భీమదేవరపల్లి, మే 13( ప్రజా మంటలు):–** 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలక్ట్రిక్ టూవీలర్, ఎలక్ట్రిక్ త్రీ వీలర్, మిల్చ్ యానిమల్స్ యూనిట్ల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుండి ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ కార్యాలయం తెలిపింది. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ విద్యార్హత, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని అధికారులు సూచించారు. ఇంటర్వ్యూల ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేస్తారని వెల్లడించారు..

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష

**గొల్లపల్లి మే 12ప్రజా మంటలు** :ధర్మపురి పట్టణ లో ఇటీవలడ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షపెద్దపెల్లి జిల్లా గోపాలరావుపేటకు చెందిన శనిగారపు రాకేష్ (28) రెండు రోజుల క్రితం ధర్మపురి పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టు పట్టుపడ గా పరీక్షలలో నిర్దేశించిన మోతాదుకు మించి, 200 ఎస్త్ర ఆల్కహాల్ సేవించినట్లు గుర్తించారు పోలీసులు అతడిని ధర్మపురి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జగిత్యాల సబ్ జైలుకు తరలించారు ఎస్ఐ,మహేష్ తెలిపారు

# కొండగట్టు అంజన్న భక్తులకు ఎం ఎస్ ఆర్ డి ఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ




**కొండగట్టు మే 12 ( ప్రజా మంటలు)** :హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకుని కొండగట్టు అంజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తుల సౌకర్యార్థం మ స్పోర్ట్స్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ఫౌండేషన్ ( ఎం ఎస్ ఆర్ డి ఎఫ్) ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు అరటి పండ్లు, మజ్జిగ మరియు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి విచ్చేసి, పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవలో యువత ముందుండటం అభినందనీయమని, భక్తుల దాహార్తిని తీర్చడం గొప్ప పుణ్యకార్యమని కొనియాడారు. ఎం ఎస్ ఆర్డిఎఫ్ ట్రస్ట్ చేస్తున్న సామాజిక కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ మామిడాల వెంకటేష్ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ట్రస్ట్ ద్వారా మరిన్ని గ్రామీణ అభివృద్ధి మరియు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీమంతుల అశోక్ కుమార్, బాశెట్టి రాజేష్ కుమార్, మొగిలి ప్రవీణ్ కుమార్, లిదైవాల రాజు కుమార్, ఎనగందుల విజయ్ మరియు వాలంటీర్లు పాల్గొని భక్తులకు సేవలందించారు

# నేడు పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్ష

**8 సెంటర్లు ఏర్పాటు - జిల్లా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అరిగేలా అశోక్**



**జగిత్యాల మే 12( ప్రజా మంటలు)** : మూడేళ్ల డిప్లమో కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టీజీ పాలీసెట్ –2026 పరీక్షలు బుధవారం అనగా నేడు నిర్వహించనున్నామని జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలు విడుదల చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది 2494 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. జిల్లా కేంద్రంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, విద్యార్థులను గంటముందుగా సెంటర్లోకి అనుమతిస్తామని తెలిపారు. నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారి దరఖాస్తులు మరియు వారి సంఖ్య.... అమ్మాయిలు ఒక 1424 మంది, అబ్బాయిలు 1070 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 2494 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులకు సూచనలు: 1.విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్ పై రెండువైపులా సంతకం చేయాల్సి ఉంటుంది2. విద్యార్థులు హెచ్బి బ్లాక్ పెన్సిల్ ఎరేజర్ బ్లూ లేదా బ్లాక్ కలర్ పెన్ వెంట తెచ్చుకోవాలి3 హాల్ టికెట్ పై ఫోటో ముద్రితం కాని వారు వెంట పాస్పోర్ట్ సైజ్ ఫోటో ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలి4 ఎస్బి టెట్ యాప్ ను ఇన్స్టాల్ చేసుకుని ఎగ్జామ్స్ సెంటర్ లొకేటర్ ఆప్షన్ ద్వారా సెంటర్లకు చేరుకోవచ్చు అని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలో పరీక్ష రాసే అభ్యర్థులు వారి తల్లిదండ్రులకు ముఖ్య సూచన జగిత్యాల పట్టణంలో ఎస్ కే ఎన్ ఆర్ బాయ్స్ జూనియర్ కళాశాల సెంటర్ కోడ్ 5504 మరియు ఎస్ కే ఎన్ ఆర్ గౌట్ ఆర్ట్స్ మరియు సైన్స్ కాలేజ్ జగిత్యాల్ టౌన్ సెంటర్ కోడ్: 5501. ఈ రెండు వేర్వేరు సెంటర్లు గురించి పేరెంట్స్ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ అరిగేలా అశోక్ పేర్కొన్నారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

**బండి కుమారుడిపై కేసు నమోదు చేయాలి**

**మాజీ జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ డిమాండ్**



**భీమదేవరపల్లి మే 12( ప్రజా మంటలు):–** కేంద్రమంత్రి బండి సంజయ్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని హనుమకొండ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ డిమాండ్ చేశారు. మండల మాజీ అధ్యక్షులు మండల సురేందర్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ, బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై 164 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు కేవలం 'జై శ్రీరామ్' నినాదాలకే పరిమితం కాకుండా, ఆ రాముడి ఆదర్శాలను ఆచరించాలని హితవు పలికారు. అలాగే కొన్ని ఆంధ్ర పత్రికల యాజమాన్యాలు తెలంగాణ పట్ల ఇప్పటికీ విషం చిమ్ముతున్నాయని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కొప్పూరు సర్పంచ్ గద్ద కుమారస్వామి, గట్ల నర్సింగపురం సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉప సర్పంచ్ బొడిగే శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు ఎర్రబెల్లి తిరుపతిరావు, శనిగరపు సదానందం, ధర్నా శ్రీనివాస్, బొల్లంపల్లి సుకుమార్, తాళ్ల జయంత్, వేముల సాధన రమేష్, గుడికందుల రాజు, మాడుగుల నరేందర్, అంబాల చక్రపాణి, ఎదులాపురం మొగిలి, సంపత్, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని కుమారుని ఆశీర్వదించిన క్లాస్మేట్,



**ఇబ్రహీంపట్నం మే 12 (ప్రజా మంటలు దగ్గుల అశోక్)** :ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన పిట్ల లక్ష్మి నర్సయ్య భార్య లత వారి పెద్ద కుమారుడు మారుతీ & లిఖిత గార్ల వివాహానికి 1992–93 క్లాస్మేట్ పిట్ల లక్ష్మీనరసయ్య కుమారుని ఆశీర్వదించిన క్లాస్ మెంట్. రఘు గౌడ్, దొంతుల తుకారాం, దగ్గుల అశోక్, కాశన్న, వెంకటేష్, దశరథం,పత్తి కృష్ణ, శ్రీనివాస్, మల్లేష్,సాయిబుషిన్,

# ధర్మపురి మండలం నేరెళ్ల కు చెందిన రౌడీ షీటర్ రిమాండ్

**గొల్లపల్లి మే 12ప్రజా మంటలు** : ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన సంబేట ఈనెల 8 తేదీ రాత్రి నర్సయ్య భార్య లక్ష్మి బర్రెలకు మేత వేయడానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన తోకల గంగాధర్ (38) ఆమెను అడ్డుకొని వెంబడిస్తూ బీరు సీసా పట్టుకొని బెదిరించగా ఆమె భర్త సంబేట నర్సయ్య మధ్యలో వెళ్లి ఆమెను అక్కడ నుంచి తీసుకువెళ్లినాడు. తర్వాత రాత్రి 10:30 గం,తోకల గంగాధర్ తోకల లక్ష్మి లు కలిసి సంబెట నర్సయ్య ,లక్ష్మిలను చంపాలని ఉద్దేశంతో వారి ఇంటి వద్దకు వెళ్లి గడ్డపారతో తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నం చేసి అక్కడ నర్సయ్య లక్ష్మి లేకపోవడంతో ఇంట్లో ఉన్న కరెంటు మోటార్ స్టాటర్ ఇతర వస్తువులను ధ్వంసం చేసినారు. సంబేట నరసయ్య ధర్మపురి స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని నిందితుడిని ధర్మపురి ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని జగిత్యాల జైలుకు తరలించారు గంగాధర్ పై గతంలో పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని ఎస్ఐ మహేష్ తెలిపారు

# పేకాట స్థావరాలపై ఉక్కు పాదం మోపిన ఎల్కాతుర్తి ఎస్ఐ







**ఎల్కతుర్తి మే 12 ప్రజా మంటలు** : ఎల్కతుర్తి మండలం లోని సూరారం గ్రామ శివారులో , సూరారం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారిని పట్టుకుని వారి దగ్గర నుంచి 6300 రూపాయల నగదు , మూడు బైకులు, 4 మొబైల్స్ సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేయడం జరిగింది.

# మక్కల కొనుగోలు కేంద్రం వద్ద రైతుల పైకి దూసుకొచ్చిన లారీ

**తృటిలో తప్పిన ప్రమాదం పలువురికి గాయాలు, బైకులు ధ్వంసం**





**గొల్లపల్లి మే 12 ప్రజా మంటలు** : గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతం వద్ద మక్కల కొనుగోలు కేంద్రంలోకి లారీ దూసుకొని రావ డంతో అక్కడే ఉన్న మక్కల కుప్పల పైకి రైతుల కూర్చొని ఉండ గా రైతులపైకి దూసు కెల్లగా పెను ప్రమాదం తప్పింది దీంతో బైకులు ధ్వంసం అయ్యాయి పలువురు రైతులకు స్వల్ప గాయాలయ్యాయి వారిని వెంటనే హుటా హుటిన జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు జాప్యం చేస్తున్నారని రైతుల ఆవేదన చెందారు రైతులు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

# పెన్షన్ కార్డ్ అంటూ ఆన్‌లైన్‌లో ప్రకటన

**లింక్‌ను క్లిక్ చేస్తే షాక్!**

**పెన్షన్ కార్డ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు**

**మోసగాళ్లకు ఇచ్చిన వ్యక్తిగత వివరాలు**

**విడతల వారీగా డబ్బు లూటీ**

**విషయం తెలుకోని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు**



వన్ టౌన్‌లో కిరాణా దుకాణం నడుపుతున్న వ్యాపారి మురళీకృష్ణకు సంబంధించిన ఇటీవలి ఆర్థిక మోసం కథ, ఆన్‌లైన్ మోసాల పట్ల ఒక హెచ్చరికగా నిలిచింది. ఫేస్‌బుక్ ఖాతా కలిగిన మురళీకృష్ణకు, అందులో ఇండస్ ఇండ్ బ్యాంకుకు పెన్షన్ కార్డుకు సంబంధించిన ఒక ప్రకటన కనిపించింది. ఆ ప్రకటన పట్ల ఆసక్తి కలిగి, అతను దానిపై క్లిక్ చేశాడు. అదే రోజు సాయంత్రం అతనికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. "మీరు పెన్షన్ కార్డు కోసం దరఖాస్తు చేశారా? ఆ కార్డు మీకు ఆన్‌లైన్‌లో పంపబడుతుంది," అని అడుగుతూ ఆ కాలర్ మురళీకృష్ణను నమ్మించాడు.మోసగాళ్లకు ఇచ్చిన వ్యక్తిగత వివరాలు : ఆ వ్యక్తి మురళీకృష్ణ ఆధార్ ,ూాచీ కార్డు నంబర్లను అడిగి తీసుకున్నాడు. ఆ తర్వాత, అతని బ్యాంక్ డెబిట్ కార్డు నంబర్, ఈమెయిల్ ×ణ ,బ్యాంక్ కస్టమర్ ×ణ అడగగా, ఆ వ్యాపారి ఆ వివరాలను కూడా అందించాడు. ఈ సమాచారం ఆధారంగా, మురళీకృష్ణ ఖాతా నుంచి నగదు బదిలీలు వేగంగా జరగడం ప్రారంభమయ్యాయి. ఆ బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన ూమీ హెచ్చరికలు అతని మొబైల్ ఫోన్‌కు రావడం మొదలయ్యాయి. ఇలా వెంటవెంటనే లావాదేవీలు జరగడం చూసి కంగారుపడిన మురళీకృష్ణ, వెంటనే వన్ టౌన్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంకుకు శాఖకు పరుగులు తీశాడు.విషయం తెలుకోని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు : అయితే అతను బ్యాంకుకు చేరుకునే సమయానికి, అతని ఖాతా నుంచి రెండు వేర్వేరు విడతలుగా మొత్తం రూ.2.38 లక్షలు రూ.5 లక్షలు ఇప్పటికే బదిలీ అయిపోయాయి. బ్యాంక్ అధికారులు ఖాతాను ఫ్రీజ్ (టతీవవఓవ) ప్రయత్నించినప్పటికీ, మరో రెండు విడతలుగా అదనంగా రూ.61,000 రూ.50,000 చొప్పున రెండు మొత్తాలు తెలియని ఖాతాలకు బదిలీ అయ్యాయి. మొత్తంగా మోసగాళ్లు అనేక లావాదేవీల ద్వారా మురళీకృష్ణ ఖాతా నుంచి రూ.10.49 లక్షల మొత్తాన్ని బదిలీ చేశారు. ఈ సంఘటనను గమనించిన మురళీకృష్ణ, పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసి, ఈ విషయంపై దర్యాప్తు ప్రారంభించింది. ప్రాథమిక విచారణలో భాగంగా, మోసగాళ్లు ఉపయోగించిన ఖాతాలు, నిధులు బదిలీ అయిన మార్గాలు నగదు విత్‌డ్రా చేసిన నిర్దిష్ట ప్రదేశాలను వారు విశ్లేషిస్తున్నారు.లింకులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసులు : మోసగాళ్లు సోషల్ మీడియా ప్రకటనలను ఆసరాగా చేసుకుని వినియోగదారుల నమ్మకాన్ని ఎలా పొందుతారో, ఆపై వారి వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను సేకరించి వాటిని ఎలా దుర్వినియోగం చేస్తారో ఈ సంఘటన స్పష్టంగా తెలియజేస్తుంది. అనుమానాస్పద ఆన్‌లైన్ ప్రకటనలను సందేహంతో చూడాలని, వాటితో వ్యవహరించేటప్పుడు ఎల్లప్పుడూ జాగ్రత్త వహించాలని ఈ కేసు ఒక హెచ్చరికగా నిలుస్తుంది. మురళీకృష్ణ వంటి బాధితులు అపరిచితుల నుంచి వచ్చే కాల్స్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరితోనూ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని కూడా ఇది ఒక హెచ్చరికగా పనిచేస్తుందని పోలీసు అధికారులు తెలుపుతున్నారు. కొనసాగుతున్న దర్యాప్తు ద్వారా, మోసగాళ్లను గుర్తించి, బాధితులకు న్యాయపరమైన పరిహారం అందించడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. నగదు బదిలీలలో ప్రమేయం ఉన్న ఖాతాలను గుర్తించే ప్రక్రియ, అలాగే నగదును అత్యంత వేగంగా ఉపసంహరించుకున్న ప్రదేశాలను కచ్చితంగా నిర్ధారించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఆన్‌లైన్ మోసాలకు బలికాకుండా తమను తాము రక్షించుకోవడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ప్రజలను కోరుతున్నారు.

# తెలంగాణలో ఇంటర్ ప్రవేశాలు

**ఆ అఫిడవిట్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం**

**ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

**ఈసారి యథావిధిగా ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ**



పాఠశాల విద్యలో ఇంటర్ విద్యను విలీనం చేయాలని భావించిన ప్రభుత్వం తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కాలేజీలు వచ్చే విద్యా సంవత్సరానికి (2026-27) ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలను చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ సోమవారం సవరించిన షెడ్యూల్‌ను జారీ చేశారు. తొలుత ఈ నెల 8వ తేదీ నుంచి అడ్మిషన్లు జరుపుకొనేలా బోర్డు షెడ్యూల్ జారీ చేసింది.షెడ్యూల్‌ను విడుదల చేసిన బోర్డు : పాఠశాల విద్యలో ఇంటర్ విద్యను విలీనం చేయాలని తొలుత భావించిన తెలంగాణ ప్రభుత్వం, ఆ షెడ్యూల్‌ను మరుసటి రోజే తాత్కాలికంగా నిలిపివేసింది. హడావిడిగా విలీనం చేయడంపై కొన్ని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల వంటి సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి, ఈసారికి పాత విధానంలోనే ప్రవేశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఇంటర్ బోర్డు సవరించిన ప్రవేశాల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. జూన్ 1వ తేదీ నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.యాంటీ డ్రగ్ అఫిడవిట్ తప్పనిసరి : ఇంటర్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆధార్ సమర్పించడం తప్పనిసరి చేశారు. దీనితో పాటు మత్తు పదార్థాలు వినియోగించబోమని, విక్రయించబోమని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల నుంచి యాంటీ డ్రగ్ అఫిడవిట్ తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వం నిబంధనల్లో స్పష్టం చేసింది.డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ : పాఠశాలల ప్రారంభం సందర్భంగా పొగాకు, మద్యం, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు తెలిపారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని రేవంత్ రెడ్డికి గతంలో గవర్నర్ సూచించిన విషయం తెలిసిందే. ఆయన సూచనను గౌరవిస్తూ పాఠశాలల విద్యార్థులతో హైదరాబాద్‌లో భారీ ఎత్తున సభ ఏర్పాటు చేసి, యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు.విద్యార్థులకు స్కూల్ కిట్ : ఈ మేరకు ఆయన సోమవారం రాత్రి బేగంపేటలోని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. సామూహిక ప్రతిజ్ఞతో పాటు పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేస్తామని, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. కిట్లలో ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, స్పోర్ట్స్ వేర్, విద్యార్థులకు అవసరమైన ఇతర సామగ్రి కూడా ఉంటాయని వివరించారు.ప్రవేశాల సమయంలో హామీపత్రం : డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, వాటిని వినియోగించడం గానీ, విక్రయించడం గానీ చేయబోమని ప్రవేశాల సందర్భంగా ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రుల సంతకాలతో హామీ పత్రం తీసుకోవాలని తెలంగాణ సర్కారు భావిస్తోంది. టీజీ న్యాబ్, ఈగల్ ఫోర్స్‌లతో నిత్యం దాడులు నిర్వహిస్తూ సరఫరా చైన్లను తెలుసుకుని ఎక్కడికక్కడ కట్టడి చేస్తోంది. దానికి ఇటీవల కాలంలో బయటపడుతున్న సంఘటనలే ఉదాహరణలు. మాదక ద్రవ్యాల విషయంలో ఇంకా దాడులు చేయాల్సిన అవసరం ఉంది.

# సాగర నగరానికి సెమీ రింగ్‌రోడ్డు - 102 కి.మీ నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు

**విశాఖలో సెమీ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు**

**భవిష్యత్తులో జనాభా పెరగనున్న నేపథ్యంలో నిర్ణయం**

**రాంబిల్లి నుంచి భోగాపురం వరకు నిర్మించేందుకు యోచన**

సాగర నగరం విస్తరిస్తోంది!. గూగుల్ డేటా సెంటర్ రాకతో గ్లోబల్ సిటీగా అవతరిస్తోంది!. ఇటు నక్కపల్లి నుంచి అటు భోగాపురం వరకు ఎటు చూసినా పరిశ్రమలు ఫార్మా కంపెనీలతో విశాఖ అభివృద్ధి పథాన నడుస్తోంది!. దీంతో రానున్న రోజుల్లో ట్రాఫిక్ కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. అందుకే రాంబిల్లి నుంచి భోగాపురం వరకు ఓ సెమీ రింగ్ రోడ్డు నిర్మించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.గూగుల్ సహా ఇతర సంస్థల డేటా సెంటర్లు!. ఐటీ పరిశ్రమలు!. ఫార్మా కంపెనీలు!. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్!. రెన్యూ ఎనర్జీ కంపెనీ!. ఇలా సాగర నగరానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద సంస్థల నుంచి పెట్టుబడులు పోటెత్తుతున్నాయి. వీటికి తోడు భోగాపురం విమానాశ్రయం త్వరలోనే ప్రారంభానికి రెడీ అవుతోంది. దీంతో ప్రస్తుతం 25 లక్షలు ఉన్న విశాఖ జనాభా, మరికొన్ని రోజుల్లో మరో పది లక్షలు పెరిగే అవకాశం ఉంది. రోడ్లపై రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో హైదరాబాద్ తరహాలో ఓ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.విశాఖకు ఓ వైపు సముద్రం ఉండటంతో సెమీ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల విస్తీర్ణంలో రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని భావిస్తోంది. ఐతే 1986లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనకాపల్లి నుంచి ఆనందపురం రోడ్డుకు ప్రణాళికలు రచించారు. ఇప్పుడు అదే రోడ్డును విస్తరించి రింగ్ రోడ్డుగా మార్చనున్నారు. ఈ రింగ్ రోడ్డును ల్యాండ్ పూలింగ్ విధానంలో నిర్మించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. ఇప్పటికే పెట్టుబడుల ఆకర్షణలో దూసుకుపోతున్న విశాఖకు ఈ సెమీ రింగ్ రోడ్డు సరికొత్త గేమ్ ఛేంజర్‌గా నిలవనుంది.ప్రపంచం చూపు విశాఖ వైపు : ఇప్పటికే రాష్ట్ర భవిష్యత్తును మార్చివేయగల ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. విశాఖ జిల్లా తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, ఐటీ మంత్రి లోకేశ్, కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ భూమిపూజ చేసిన విషయం తెలిసిందే.ఏఐ, ఎంఐలపై పనిచేసే కంపెనీలకు కావాల్సిన నిపుణుల్ని తయారుచేసేందుకు విశాఖ



చుట్టుపక్కలకు విద్యాసంస్థలూ పెద్ద సంఖ్యలో వస్తాయి. ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలూ ఏఐ, ఎంఐ, డేటా ఇంజినీరింగ్‌లో ప్రత్యేక కోర్సులు ప్రారంభిస్తాయి. విశాఖలో డేటా పార్క్ శంకుస్థాపనకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ : మరోవైపు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రజల కల నెరవేరుతోంది. జూన్ నుంచి 'దక్షిణ కోస్తా రైల్వేజోన్' అధికారికంగా అమల్లోకి రానుంది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ను జూన్ 1 నుంచి అధికారికంగా గుర్తించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది. దీంతో రానున్న రోజుల్లో విశాఖపట్నంలో ట్రాఫిక్ కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. అందుకే రాంబిల్లి నుంచి భోగాపురం వరకు ఓ సెమీ రింగ్ రోడ్డు నిర్మించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# దేశంలో ఇంధన కొరత లేదు, కానీ రోజుకు రూ. 1000 కోట్ల నష్టం

**దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల కొరత లేదన్న కేంద్రం**

**ధరల పెంపునకు రంగం సిద్ధం చేస్తున్నారంటూ విపక్షాల విమర్శ**

**ప్రధాని పిలుపుతో భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు, రూపాయి**



పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు పాటించాలంటూ ప్రజలకు పిలుపునిచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోలియం ఉత్పత్తులకు ఎలాంటి కొరతా లేదని స్పష్టం చేసింది. అయితే, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా, ఆ భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రోజుకు దాదాపు రూ.1,000 కోట్ల నష్టాలను భరిస్తున్నాయని వెల్లడించింది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రుల కమిటీ సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. దేశంలో 60 రోజులకు సరిపడా ముడిచమురు, 45 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. 703 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. అయితే, అంతర్జాతీయ ధరల వల్ల దేశంపై భారీ భారం పడుతోందని, ఇంధన పొదుపు ద్వారా ఈ భారాన్ని తగ్గించవచ్చని ప్రభుత్వం పేర్కొంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల వాడకాన్ని తగ్గించాలని, అనవసరమైన విదేశీ మారక వ్యయాన్ని నివారించాలని ప్రధాని మోదీ తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు.ప్రధాని పిలుపుపై విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఇది మోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇంధన ధరల పెంపునకు రంగం సిద్ధం చేస్తున్నారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్నికల తర్వాతే ఈ సంక్షోభం ఎందుకు గుర్తుకొచ్చిందని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించగా, మంగళసూత్రాల గురించి మాట్లాడిన మోదీయే ఇప్పుడు బంగారం కొనవద్దని చెప్పడం విడ్డూరంగా ఉందని తేజస్వి యాదవ్ ఎద్దేవా చేశారు.ప్రధాని పిలుపు ప్రభావంతో సోమవారం స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. రూపాయి విలువ ఆల్-టైమ్ కనిష్టానికి చేరింది. ఈ విమర్శలపై స్పందించిన బీజేపీ, ఇది దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయమని, గతంలో నెహ్రూ కూడా ఇలాంటి పిలుపు ఇచ్చారని గుర్తు చేసింది.

# సీజ్‌ఫైర్ వెంటిలేటర్‌పై ఉంది

**ఇరాన్‌ది శాంతి ప్రతిపాదన కాదు ఓ చెత్త ప్లాన్: ట్రంప్**

**ఇరాన్ తాజా ప్రతిపాదనలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

**చెత్త ప్రతిపాదన అంటూ విమర్శ**

**చైనా పర్యటనపై ఆసక్తి ఉందన్న ట్రంప్**

ఇరాన్ చేసిన తాజా శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. దానిని చెత్త ప్రతిపాదనన ఉంటూ విమర్శించారు. ప్రస్తుతం కాల్పుల విరమణ వెంటిలేటర్‌పై ఉందంటూ వ్యాఖ్యనించారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో నిర్వహించిన మాతృ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'వాళ్లు పంపిన ఆ చెత్త ప్రతిపాదనను నేను పూర్తిగా కూడా చదవలేదు. ఇరాన్ ఇంతకు ముందెన్నడూ లేనంత బలహీనంగా ఉంది. ప్రస్తుతం వాళ్లు వెంటిలేటర్‌పై ఉన్నారు. కాల్పుల విరమమ కూడా భారీ స్థాయిలోనే వెంటిలేటర్‌పై ఉంది. ఇరాన్ ఇప్పటికే సైనికంగా ఓడిపోయింది. కాల్పుల విరమణ సమయంలో ఇరాన్ ఎంత కొంత పునర్నిర్మాణం చేసుకుంది. కానీ అమెరికా ఒక్క రోజులో దాన్ని పూర్తిగా ధ్వంసం చేయగలదు. ఇరాన్‌కు అణ్వాయుధాలు ఉండకూడదు. వారు చాలా ప్రమాదకరమైన దేశం. అత్యంత అస్థిర స్వభావం కలిగిన వారు' అని ట్రంప్ తెలిపారు.అమెరికా దిగ్బంధనంపై ట్రంప్ ప్రశంసలుఇరాన్‌పై కొనసాగుతున్న దిగ్బంధనాన్ని ట్రంప్ సైనిక వ్యూహాత్మక విజయంగా అభివర్ణించారు. ప్రస్తుతం అమెరికా వద్ద రెండు నెలల క్రితం కంటే మరింత శక్తివంతమైన ఆయుధ సామగ్రి ఉందన్నారు. తాము ప్రపంచానికి సేవ చేస్తున్నామని అన్నారు. ఇరాన్ నాయకత్వంపై కూడా ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వారి నాయకత్వం మొదటి, రెండో, మూడో స్థాయిలో సగం వరకు హతమైందని తెలిపారు.అలాంటి



పరిస్థితిలో వచ్చి తమతో చర్చలు జరపాలని చెబుతూ మూర్ఖమైన ప్రతిపాదన పంపారని అన్నారు. దాన్ని ఎవరూ అంగీకరించరని, అయితే బరాక్ ఒబామా లేదా జో బైడెన్ అయితే ఇంగీకరించి ఉండేవారని ఎద్దేవా చేశారు. 'న్యూక్లియర్ డస్ట్ తీసుకెళ్లమని ఇరాన్ కోరింది'ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడుల తర్వాత అక్కడ ఏర్పడిన న్యూక్లియర్ డస్ట్‌ను తొలగించాలని తమను కోరిందని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఆ స్థావరం పూర్తిగా ధ్వంసమైందని ఇరాన్ చెప్పింది. దాన్ని తొలగించే సామర్థ్యం ప్రపంచంలో అమెరికా, చైనా వద్ద మాత్రమే ఉందని వారు చెప్పారు. మాకు ఆ పనిని చేయాలని కోరారు' అని ట్రంప్ పేర్కొన్నారు.'చైనాతో ఇప్పుడు అద్భుతంగా వ్యాపారం చేస్తున్నాం'చైనా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సమావేశం కోసం ఆస్తకిగా ఎదురుచూస్తున్నానని ట్రంప్ తెలిపారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు చైనాతో చాలా తెలివైన వ్యాపారం చేస్తున్నామని అన్నారు. గత అధ్యక్షుల కాలంలో అమెరికాను చాలా ఏళ్ల పాటు మోసం చేశారని, ఇప్పుడు మాత్రం చైనాతో అద్భుతంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. చైనాతో వ్యాపారం ద్వారా భారీగా ఆదాయం పొందుతున్నామని చెప్పారు.'టారిఫ్‌ల బెదిరింపుల వల్లే'అక్రమ వలసల నియంత్రణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ట్రంప్ పేర్కొన్నారు. బహిష్కరించిన వలసదారులను తిరిగి తీసుకోవడానికి నిరాకరించిన దేశాలు, టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించగానే అంగీకరించాయని తెలిపారు. అమెరికా సరిహద్దుల కుండా ఫెంటానిల్ స్మగ్లింగ్ గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. 60 శాతానికి పైగా తగ్గిందని, సముద్ర మార్గం ద్వారా వచ్చే అక్రమ రవాణా 97 శాతం పడిపోయిందని తెలిపారు. ఈ విజయాలకు అమెరికా చట్ట అమలు సంస్థలే కారణమని ట్రంప్ కొనియాడారు.'ట్రంప్ 14 పాయింట్ల ప్రతిపాదనను అంగీకరించాల్సిందే'ఇదిలా ఉండగా 14 పాయింట్ల ప్రతిపాదనను అంగీకరించాల్సిందే అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబఫ్ తెలిపారు. ఇరాన్ ప్రజల హక్కులను ప్రతిబింబించే 14 పాయింట్ల ప్రతిపాదనను అంగీకరించడం తప్ప మరో మార్గం లేదని సూచించారు. ఇతర మార్గాలు పూర్తిగా విఫలమవుతాయని, ఆలస్యం చేస్తే అమెరికా పన్ను చెల్లింపుదారులకే భారం పెరుగుతుందని వ్యాఖ్యనించారు. అమెరికాతో జరిగే చర్చల్లో అణు సాంకేతికత, యురేనియం శుద్ధీకరణ అంశాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చకు రావని ఇరాన్ అణుశక్తి సంస్థ అధిపతి మహమ్మద్ ఇస్లామీ స్పష్టం చేశారు. కేవలం యుద్ధాన్ని ముగించే అంశంపైనే ఉండాలని, యురేనియం శుద్ధీకరణపై చర్చే ఉండదని అన్నారు.

# ఏటీఎంలో సెలూన్ షాప్.. ఎక్కడో తెలుసా




బీహార్‌లోని దానాపూర్‌లో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్లే ఓ ఎస్బీఐ ఏటీఎం, ఇప్పుడు హెయిర్‌కట్, షేవింగ్ చేసే సెలూన్‌గా మారిపోయింది. బయట నుంచి చూస్తే అచ్చం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలాగే కనిపించడంతో లోపలికి వెళ్లిన వారు షాక్ అవుతున్నారు. ఈ విచిత్రమైన 'సెలూన్ ఏటీఎం'కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.దానాపూర్‌లోని రూపస్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఈ ఏటీఎం కియోస్క్ వద్ద కొన్నేళ్ల పాటు ఎస్బీఐ ఏటీఎం పనిచేసేది. కొన్ని నెలల క్రితం బ్యాంకు ఆ ఏటీఎంను అక్కడి నుంచి తొలగించింది. అయితే, ఏటీఎం ఖాళీ అయినా బయట ఉన్న ఎస్బీఐ బోర్డు, లోగో వంటి గుర్తులను మాత్రం అలాగే వదిలేశారు. ఆ తర్వాత ఆ ఖాళీ స్థలాన్ని ఓ సెలూన్ యజమాని అద్దెకు తీసుకున్నారు.బయట ఏటీఎం బోర్డు ఉండటంతో డబ్బుల కోసం చాలామంది లోపలికి వెళ్తున్నారు. తీరా అక్కడ ఏటీఎం మెషీన్‌కు బదులుగా సెలూన్ కుర్చీలు, అద్దాలు, కటింగ్ పరికరాలు చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ ఘటనపై వీడియో వైరల్ కావడంతో అధికారులు వెంటనే స్పందించి ఎస్బీఐ బోర్డు, లోగోను తొలగించారు.ఈ విషయంపై నెటిజన్లు సరదాగా స్పందిస్తున్నారు. "డబ్బులు విత్‌డ్రా చేయడానికి వెళ్తే, హెయిర్‌కట్‌తో బయటకు వస్తున్నారు" అంటూ కొందరు కామెంట్ చేశారు. ఇది అసలైన భారతీయ 'జుగాడ్' అని మరికొందరు అభిప్రాయపడ్డారు. పాత గుర్తులను తొలగించకుండా కొత్త వ్యాపారాలు చేయడం ఇక్కడ సాధారణమేనని మరికొందరు చమత్కరించారు.

# ప్రారంభమైన 'ఔషధి ఎక్స్‌ప్రెస్' దేశంలోనే తొలి ఫార్మసీ రైలు!

**ఔషధి ఎక్స్‌ప్రెస్ పేరుతో దేశంలోనే తొలి ఫార్మసీ రైలు ప్రారంభం**

**హైదరాబాద్ నుంచి ముంబై పోర్టుకు ఔషధాల సురక్షిత రవాణా**

**అత్యాధునిక కోల్డ్ స్టోరేజీతో మందుల నాణ్యతకు పూర్తి భరోసా**

**తెలంగాణ ఫార్మా రంగానికి ఇదొక లైఫ్ లైన్ అని తెలిపిన కిషన్ రెడ్డి**

**పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా ఈ వినూత్న ప్రయోగం**

భారతీయ రైల్వే మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. హైదరాబాద్ నుంచి ఔషధాలను సురక్షితంగా ఎగుమతి చేసేందుకు 'ఔషధి ఎక్స్‌ప్రెస్' పేరుతో దేశంలోనే మొట్టమొదటి ఫార్మసీ రైలును అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 2వ తేదీన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టుకు తన తొలి యాత్రను విజయవంతంగా పూర్తి చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఔషధాలను వాటి నాణ్యత ఏమాత్రం దెబ్బతినకుండా నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయడం అత్యంత కీలకం. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ రైలులో అత్యాధునిక కోల్డ్ స్టోరేజీ కంటైనర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల హైదరాబాద్‌లోని వందలాది ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను సురక్షితంగా, వేగంగా ముంబై పోర్టుకు చేరవేసి, అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేయడం సులభతరం అవుతుంది. గతంలో రోడ్డు మార్గంలో రవాణాకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల మందులు పాడయ్యే ప్రమాదం ఉండేది. ఔషధి ఎక్స్‌ప్రెస్ ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనుంది.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ఆవిష్కరణకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. "ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదు, తెలంగాణ ఫార్మా రంగానికి ఒక లైఫ్ లైన్ వంటిది. దీనివల్ల సరైన సమయంలో, సరైన నాణ్యతతో మందులు గమ్యస్థానాలకు



చేరతాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తులో దేశంలోని ఇతర ఫార్మా కేంద్రాలకు కూడా ఇలాంటి రైళ్లను విస్తరించే యోచనలో ఉన్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com